కూటమి కక్ష.. విద్యార్థులకు శిక్ష


పనులు నిలిచిన తూర్పు కట్టకిందపల్లెలో ఎంపీయూపీ పాఠశాల భవనం


శిథిలావస్థలో మూసివేసి ఉన్న తూర్పు కట్టకిందపల్లెలో ఎంపీయూపీ పాఠశాల

నాడు-నేడు పనులకు కూటమి గ్రహణం

- కూటమి అధికారంలోకి రాగానే ఎక్కడికక్కడ నిలిచిన నాడు-నేడు పనులు
- ఏడాది కావస్తున్నా ఊసేలేని మనబడి -మన భవిష్యత్ పథకం
- మరో 10 రోజుల్లో ప్రారంభంకానున్న పాఠశాలలు
- అసంపూర్తి భవనాలతో ఆందోళనలో విద్యార్థులు

పామూరు:

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే కుటిలతత్వంతో అప్పటివరకు సాగుతున్న నాడు-నేడు పనులను నిలిపివేసింది. నాడు-నేడు పథకం పేరును మనబడి-మనభవిష్యత్‌గా మార్చింది. పథకం పేరు మార్చినా గత ప్రభుత్వం హయాంలో చేపట్టి కొనసాగుతున్న పాఠశాలల భవన నిర్మాణాలు, వంటగదుల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులను కొనసాగించి ఉంటే పాఠశాలలు అభివృద్ధి పథంలో నడిచేవి. కానీ కూటమిప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత పాఠశాలల నిర్మాణాలకు నిధులు నిలిపి వేయడంతో పాటు జరుగుతున్న పనులను సైతం ఎక్కడికక్కడ నిలిపి వేయడంతో పాఠశాలల అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారింది. దీంతో పాఠశాలల్లో నిర్మాణ దశలో ఉన్న తరగతిగదుల నిర్మాణాలు నిలిపోగా విద్యార్థులు పడే అవస్థలు అన్నీ ఇన్నీ కావు. కొన్ని పాఠశాలల్లో తరగతిగదులు శిథిలావస్థకు చేరుకోవడంతో ఉపాధ్యాయులు విద్యార్థులను సమీపంలోని పాఠశాలలకు తరలించి అక్కడ తరగతులు నిర్వహిస్తున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టింది. విద్యారంగానికి ప్రాధాన్యం ఇచ్చిన నాటి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దింది. మండలంలో నాడు- నేడు మొదటి విడత కింద 28 పాఠశాలను రూ.6 కోట్లతో మరమ్మతులు చేసి అభివృద్ధి చేశారు. రెండో విడత కింద 25 పాఠశాలలకు రూ.14 కోటల్ మంజూరు కాగా పనులు ప్రహరీల నిర్మాణం, అదనపు తరగతి గదుల నిర్మాణం అధికశాతం పనులు పూర్తయ్యాయి. ప్రభుత్వం మారిన తరువాత నిధులు రాకపోవడంతో మిగతా పనులు ముఖ్యంగా ఫ్లోరింగ్, ప్లాస్టింగ్ కొన్నిచోట్ల, నిర్మాణ పనులు కొన్నిచోట్ల విద్యుత్ ఇతర పనులు, మొదలు పెట్టకపోగా పనులు పూర్తిగా నిలిచిపోయాయి.

పరాయి పంచన కట్టకిందపల్లె విద్యార్థులు

తూర్పుకట్టకిందపల్లె ఎంపీయూపీ పాఠశాల భవనం శిథిలావస్థలో ఉండగా నాడు-నేడు రెండవ విడతలో రు.42 లక్షలు గదులు నిర్మాణానికి, మరుగుదొడ్లు, వంటగది మరమ్మతులకు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించి స్లాబ్‌వరకు పనులుకాగా సుమారు రూ.12.40 లక్షలు మాత్రమే నిధులు రాగా మిగిలినవి రాకపోగా పనులు నిలిచిపోయాయి. కాగా ఈ పాఠశాలలోని 33 మంది విద్యార్థులు 2022-23 విద్యా సంవత్సరం నుంచి సమీపంలో ఎస్సీకాలనీ ఎంపీపీఎస్‌కు వెళ్తుండగా స్థల లేమితో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మోపాడు ప్రాథమికోన్నత పాఠశాల భవన నిర్మాణపనులు కూడా నిధుల లేమితో నిలిచిపోయాయి. ఈ పాఠశాల ప్రస్తుతం ప్రాథమికోన్నత పాఠశాల నుంచి ఉన్నత పాఠశాల కానుండగా గదులు మాత్రం అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఇదే తరహాలోనే మండలంలోని పలుపాఠశాలలు వివిధ అభివృద్ధి పనులు నిలిచి పోయిఉన్నాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి మన బడి మనభవిష్యత్ పథకం కింద నిధులు మంజూరు చేసి పాఠశాలలను అభివృద్ధి చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం:

పాఠశాల స్థాయి పెంపు, తగ్గింపు, మోడల్ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటు, ఉన్నత పాఠశాలల ఏర్పాటు మొదలైన ప్రక్రియ జరుగుతోంది. 2025-26 విద్యాసంవత్సరం ప్రారంభమైన తరువాత ఈ పాఠశాలలకు అవసరాన్ని బట్టి గదుల నిర్మాణానికి మనబడి-మనభవిష్యత్ పథకంకింద నిధులు వస్తాయి. నిధులు వచ్చిన వెంటనే పనులు చేయించి సమస్యను పరిష్కరిస్తాం.

జి.కరుణకుమారి, ఎంఈఓ

పనులు వెంటనే ప్రారంభించాలి:



కూటమి ప్రభుత్వం మనబడి-మనభవిష్యత్ పథకం ద్వారా తక్షణం నిధులు విడుదల చేసి నిలిచిపోయిన పాఠశాలల తరగతిగదుల నిర్మాణాలు, మరుగుదొడ్లు, వంటశాలలు తక్షణం పూర్తిచేయాలి. మరో 10 రోజుల్లో పాఠశాలలు పునః ప్రారంభం కానుంగా ప్రభుత్వం త్వరితగతిన చర్యలు చేపట్టి విద్యార్థులకు బాసటగా నిలవాలి.

పి.ప్రభాకర్, సీపీఐ మండల కార్యదర్శి, పామూరు


మోపాడులో నిర్మాణ దశలో నిలిచిపోయిన తరగతి గదుల పనులు


తూర్పు కట్టకిందపల్లె ఎస్సీ పాఠశాలలో ఉన్న ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులు

క్లుప్తంగా

సస్యరక్షణ చర్యలు పాటించండి


మాట్లాడుతున్న ఏఓ సుధాకర్

సింగరాయకొండ: పంటల సాగులో సస్యరక్షణ చర్యలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏఓ సుధాకర్ అన్నారు. మండలంలోని కలికవాయ, బింగినపల్లి రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు ఆధునిక పద్ధతిలో పంటల సాగు పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పచ్చిరొట్ట ఎరువులను సాగు చేసి భూమిని సారవంతం చేసుకోవాలని, సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులు లభిస్తాయన్నారు. పంటలకు ఆశించే తెగుళ్ల నివారణ పై రైతులకు అవగాహన కల్పించారు. కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఉల్లాసం


యోగాశిక్షణ తరగతుల్లో సచివాలయ సిబ్బంది

హనుమంతునిపాడు: యోగాతో మానసిక ఉల్లాసం చేకూరుతుందని ఎంపీడీఓ ఎం రంగ సుబ్బరాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగా శిక్షణలో ఆయన మాట్లాడారు. యోగా ప్రతి ఒక్కరికీ మానసిక ఉల్లాసంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం ఇస్తుందన్నారు. యోగా చేయడం వల్ల ఎటువంటి వ్యాధులు రాకుండా మంచి ఆరోగ్యాని పొందవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ యోగాసనాల సాధన చేయాలన్నారు. సర్వేయర్ రమణయ్య, సీనియర్ అసిస్టెంట్ రమేష్, వీఆర్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఆరోగ్యం

వలేటివారిపాలెం: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎంపీడీవో నరేంద్రదేవ్ పేర్కొన్నారు. మంగళవారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని చుండి గ్రామ సచివాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వయస్సుల వారు యోగాలో పాల్గొనాలన్నారు. ధ్యాన పద్ధతులను నేర్చుకొని మానసిక, శారీక ఆరోగ్యాన్ని ప్రశాంతతను అలవర్చుకోవాల్నారు. పారిశుద్ధ్యం, ఆరోగ్య పరిక్షణపై సూచనలు చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


యోగా చేస్తున్న గ్రామస్తులు, అధికారులు

మెనూ సక్రమంగా అమలు చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు

హనుమంతునిపాడు: మధ్యాహ్న భోజనంలో మెనూ సక్రమంగా అమలు చేయాలని ఎంపీడీఓ ఎం రంగసుబ్బారాయుడు అన్నారు. స్థానిక ఎమ్మార్సీలో కుకింగ్ ఏజెన్సీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్నాయని, కుకింగ్ ఏజెన్సీలు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలన్నారు. భోజన నిర్వహణలో ఎటువంటి తేడాలు లేకుండా చూసుకోవాలన్నారు. ఎంఈఓలు జి.పెద్దిరాజు, ఎస్ రమణయ్య, సీఆర్పీలు పాల్గొన్నారు.

కూలీలందరికీ పని కల్పించాలి

పీసీపల్లి: పని అడిగిన కూలీలందరికీ పని కల్పించాలని ఎంపీడీఓ ప్రభాకర్ శర్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పంచాయతీల్లో పని ప్రారంభించాలన్నారు. క్షేత్ర స్థాయి సిబ్బంది అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏపీఓ జహంగీర్ బాష, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సర్వర్లు పనిచేయక తిప్పలు


టంగుటూరులో ఈ - పాస్ మిషను పనిచేయక వేచి ఉన్న కార్డుదారులు

టంగుటూరు: కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దు చేసి రేషన్ దుకాణాలల్లో పంపిణీ చేయడంతో కార్డుదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. టంగుటూరులోని రేషన్ దుకాణంలో ఈ - పాస్ మిషన్లు సర్వలు పనిచేయక పనులు మానుకొని రేషన్ దుకాణాల వద్ద గంటల కొద్దు పడిగాపులు కాయాల్సి వస్తుంది.

'వెన్నుపోటు దినం' విజయవంతం చేయండి


హెచ్‌ఎంపాడు: వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణలో నేతలు

హనుమంతునిపాడు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఏడాదైనా హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడాన్ని నిరసిస్తూ కనిగిరిలో బుధవారం చేపట్టి వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఎన్నో హామీలిచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాదైనా ఒక్క హామీని అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేసిందన్నారు. ఈ క్రమంలో కనిగిరిలో పార్టీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టి నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. క్రాయక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు శ్యామల సాంబిరెడ్డి, గృహ సారధుల అధ్యక్షుడు మద్ది తిరుపతయ్య, కేతిబోయిన వెంకటకాశయ్య, బీసీ నాయకులు బంకా నరిసింహరావు, కె.నారాయణ, ఎంపీటీసీ రాజు, నారాయణస్వామి,సర్పంచ్ కత్తిరాజారావు తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లి: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కనిగిరిలో బుధవారం జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ సీనియర్ నాయకులు ఓకే రెడ్డి, భూమిరెడ్డి కొండారెడ్డి మూల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హామీలు అమలు చేయాలని కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎర్రంరెడ్డి మోహన్ రెడ్డి, గుంటగాని భాస్కర్, నజీర్‌బాష, పెరికల వెంకటేశ్వర్లు, పర్చూరు రమేష్, సుదర్శనం, నల్లగంగుల శ్రీనివాస్ యాదవ్, నర్సారెడ్డి, ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'వెన్నుపోటు దినం' జయప్రదం చేయండి

కనిగిరిరూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడాన్ని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొంటారన్నారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, పార్టీ వివిధ అనుబంధ విభాగాల నాయకులు అందరూ హాజరు కావాలని కోరారు.


పీసీపల్లిలో పోస్టర్ ఆవిష్కరణలో నేతలు

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

కొండపి: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని పీహెచ్‌సీ వైద్యురాలు అనూష అన్నారు. మలేరియా నివారణ మహోత్సవంలో భాగంగా పెట్లూరులో మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనూష మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో మురుగునీటి నిల్వల్లో దోమలు వృద్ధి చెందకుండా చూడాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మలేరియా వల్ల చలి, వాంతులు, వణుకుతో కూడిన జ్వరం వస్తుందన్నారు. దోమ కుట్టిన ఎనిమిది నుంచి 12 రోజుల్లో ఈ లక్షణాలు బయట పడతాయని తెలిపారు. వెంటనే చికిత్స తీసుకోవడం ద్వారా ఈ వ్యాధి నుంచి బయటపడవచ్చు అన్నారు. ఎంఎల్‌హెచ్‌పి లక్ష్మీ నరసింహ,కాంతారావు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.


కొండపిలో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ అనూష, సిబ్బంది

వైభవంగా రాచూరి పెద్దమ్మతల్లి తిరునాళ్ల

సీఎస్‌పురం(పామూరు): మండల కేంద్రంలోని వడియరాజుల నగర్‌లో గత నాలుగు రోజులుగా శ్రీరాచూరి పెద్దమ్మతల్లి తిరునాళ్ల వైభవంగా సాగుతోంది. అర్చకులు కేశవ వేదమంత్రాలతో విశిష్ట పూజలు చేశారు. విశిష్ట పూజల్లో వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణయాదవ్, నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ దద్దాల, ఇతర నేతలను సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో బత్తుల దేవరాజు, మన్నేపల్లి పెద్దన్న, బొట్లా చిరంజీవి, ఇండ్ల వీరాంజనేయులు, కటికల వెంకటరత్నం, తమ్మిశెట్టి అంకబాబు, బండారు వెంకటేశ్వర్లు, బండారు దేవదాసు తదితరులు పాల్గొన్నారు.


పెద్దమ్మతల్లి ఆలయంలో పూజల్లో పాల్గొన్న దద్దాల, నేతలు

విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ

- కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రమేష్

కనిగిరిరూరల్: విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ సాధ్యమని జిల్లా నోడల్ అధికారి, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.రమేష్ అన్నారు. మండలంలోని తాళ్లూరు, బొమ్మిరెడ్డిపల్లి గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా ఖరీఫ్ పంటలపై అవగాహన కార్యక్రమం మంగళవారం కేవీకే నోడల్ అధికారి కె.సంధ్యరాణి అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ జి.రమేష్ మాట్లాడుతూ రైతులు విధిగా విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. విత్తన శుద్ధి వల్ల పంటలో వచ్చే పురుగులు, తెగుళ్లను చాలా వరకు నివారించవచ్చన్నారు. రసాయనక ఎరువులు వాడకం తగ్గించాలన్నారు. ఖరీఫ్ పంటలు వేసే ముందు పచ్చిరొట్ట ఎరువులు వేయడం ఎంతో మంచిదని, వాటి వల్ల అధిక దిగుబడులు వస్తాయని చెప్పారు. కోళ్ల పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ బి.ప్రకాష్ కోళ్లలో వచ్చే వ్యాధులు, వాటి నివారణ చర్యల గురించి వివరించారు. ఏడీఏ ఈ వెంకట రమణ మాట్లాడుతూ రైతులు విధిగా పొలాల్లో మట్టి పరీక్షలు చేయించాలన్నారు. భూసార పరీక్షలను బట్టి రసాయన ఎరువులు వేసుకోవాలన్నారు. వ్యవసాయాధికారి పి.జోత్స్యాతదేవి మాట్లాడుతూ రైతులు అధికారుల సూచనలు, సలహాలు పాటించి పంట సాగులు చేయాలన్నారు. సర్పంచ్‌లు మంగతాయర్, కేవీకే సిబ్బంది, వ్యవసాయాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

బడిఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలి

పామూరు: బడిఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించి వారు పాఠశాలలకు వచ్చేలా ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు అంకితభావంతో కృషి చేయాలని సీడీపీఓ పి.సరోజిని, ఎంఈఓ గరికపాటి కరుణకుమారి అన్నారు. పామూరు సెక్టార్ పరిధిలోని పామూరు విరాట్‌నగర్, తూర్పుకోడిగుడ్లపాడు అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నపిల్లలు, కిశోరి బాలికలతో చర్చించారు. 11 నుంచి 18 ఏళ్ల లోపు బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. విరాట్‌నగర్ కేంద్రం పరిధిలో ఆరుగురు డ్రాపౌట్స్‌ను గుర్తించి వారు కేజీబీవీలో చదువుకోవాలని సూచించి వారికి, తల్లిదండ్రులకు విద్య ప్రాముఖ్యంపై అవగాహన చేశారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పామూరులో పిల్లలు, తల్లులతో మాట్లాడుతున్న సీడీపీఓ, ఎంఈఓ

పొగాకు కనిష్ట ధర రూ.200


మాట్లాడుతున్న వేలం నిర్వహణాధికారి సునీల్‌కుమార్

కొండపి: శీతల గిడ్డంగుల్లో ఉన్న బేళ్ల వివరాలు తెలియపరచాలని వేలం నిర్వహణ అధికారి సునీల్ కుమార్ అన్నారు. మంగళవారం నిర్వహించిన వేలంలో క్లస్టర్ పరిధిలోని కట్టావారిపాలెం, నర్సింగోలు, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన రైతులు 800 బేళ్లను తీసుకురాగా 650 బేళ్లను కొనుగోలు చేసి 150 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.200, సరాసరి ధర రూ.259.23గా నమోదైంది. వేలంలో 18 కంపెనీలు పాల్గొన్నాయి.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో మంగవారం నిర్వహించిన వేలంలో 139 పొగాకు బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. పొందూరు క్లస్టర్ గ్రామాలకి చేందిన రైతులు 609 బేళ్లను వేలానికి తీసుకురాగా 470 బేళ్లను కొనుగోలు చేసి 134 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.190, సరాసరి ధర రూ.231.16 పలికింది. వేలంలో 23 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు


కౌలుకార్డులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పీసీపల్లి: అర్హులైన కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు అందజేస్తామని తహసీల్దార్ ఉష, వ్యవసాయాధికారి ప్రకాష్‌రావు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌలు రైతులు భూ యజమానులు దగ్గర పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డుతో పాటుగా ఒప్పంద పత్రం, రెవెన్యూ సిబ్బంది ధ్రువీకరణ పత్రం తీసుకోవాలన్నారు. మండలంలో 1279 కార్డులు ఇచ్చేలా లక్ష్యం ఉందన్నారు.

మర్రిపూడి: కౌలు పత్రం అర్హత కలిగిన కౌలు రైతులకు కేవలం పంటలపై మాత్రమే హక్కు ఉంటుందని డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కౌలు పత్రాల జారీపై అవగాహన కల్పించారు. కౌలు రైతులు అన్ని ధ్రువీకరణ పత్రాలతో దరకాస్తు చేసుకుంటే పరిశీలించి మూడు రోజుల్లో కార్డు మంజూరు చేస్తామన్నారు. రెవెన్యూ అధికారులు, గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు ఉన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

కనిగిరిరూరల్: నీటి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని ఒకటవ వార్డు, పాత సాయిబాబా గుడి ఏరియాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ప్రజలు నీరు, విద్యుత్, డ్రైనేజీ, లైట్లు తదితర సమస్యలను చైర్మన్‌కు విన్నవించారు. రెండు నెలలుగా బోరు పనిచేయక పోవడంతో వాడుక నీటికి సైతం ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు వెల్లడించారు. దీంతో చైర్మన్ గఫార్ తక్షణం అధికారులతో మాట్లాడి ఆప్రాంతంలో బోర్‌వెల్‌ను ఏర్పాటు చేసి, నీటి సమస్యను పరిష్కరించారు.